క్లుప్తంగా

నందిపేటలో 'ఇంటింటికీ బీజేపీ'



మాక్లూర్: నందిపేట మండలంలో శనివారం మండల బీజేపీ నాయకులు 'పల్లెపల్లెకు ఓబీసీ– ఇంటింటికీ బీజేపీ' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వెల్మల్ భూమేష్ ఆధ్వర్యంలో తల్వేద, సిరాం జీపల్లి, లక్కంపల్లి, దేవిపట్నం, సీహెచ్ కొండూర్ గ్రామాలలో పర్యటించి, కరపత్రాలు అందించారు. బీజేపీ మండల నాయకులు నాగతారక్, లక్కంపల్లి రవి, ఆయా గ్రామాల బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలి



ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ కొత్తరేషన్ కార్డులు అందించాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు ఎండీ నజీర్ అన్నారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ రేషన్ దుకాణం వద్ద శనివారం పీవోడబ్ల్యూ, పీవైఎల్, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పన్నుల భారం మోపుతుందన్నారు. పేదలకు 10 కేజీల నాణ్యమైన సన్న బియ్యం, 12 రకాల సరుకులు, 50శాతం సిబ్సిడీతో గ్యాస్ సిలెండర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌లో 'బలగం' ప్రదర్శన



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రెండో వార్డులో కౌన్సిలర్ ఖాందేష్ సంగీత ఆధ్వర్యంలో శనివారం బలగం సినిమాను ప్రదర్శించారు. కుటుంబం, బంధం, బంధుత్వం వాటి గొప్పతనం గురించి చెప్పిన గొప్ప చిత్రం 'బలగం' అన్ని ఖాందేష్ సంగీత అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, ఖాందేష్ సత్యం, సాయినాథ్, నరేష్, సుధాకర్, గోపి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో పీఎంకు తిరిగే హక్కు లేదు



వర్ని: తెలంగాణ ప్రజలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా తెలంగాణలో తిరిగే హక్కు ప్రధాని నరేంద్ర మోదీకి లేదని సీపీఎం వర్ని ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ స్పష్టం చేశారు. తెలంగాణలో శనివారం పీఎం పర్యటనకు నిరసనగా మండల కేంద్రంలో 'గో బ్యాక్ ప్రధాని నరేంద్ర మోదీ' అంటూ ప్లకార్డులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా నన్నేసాబ్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా, ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన హార్టికల్చర్ యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు హామీలు అమలు చేయకుండా తెలంగాణలో పర్యటించడానికి సిగ్గుండాలన్నారు. సింగరేణిని ప్రైవేటీకరిస్తే బీజేపీ ప్రభుత్వానికి దేశ ప్రజలు సమాధి కడతారని హెచ్చరించారు. సీపీఎం నాయకులు కటారి రాములు, సాయిబాబు, లక్ష్మి, సావిత్రి, దత్తు, అంజవ్వ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



బాల్కొండ: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై శంకర్ అన్నారు. మండలంలోని చిట్టాపూర్‌లో శనివారం సైబర్ నేరాల నివారణకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణకు ఉపయోగపడుతాయన్నారు. సర్పంచ్ వనజ గోవర్ధన్‌గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో కార్యాలయాలు



బోధన్‌లోని ఎక్సైజ్ సీఐ కార్యాలయం



పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలో గల ఆర్‌టీఏ కార్యాలయం

- అర్జీదారులకు అవస్థలు
- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు

బోధన్‌టౌన్(బోధన్) : 1956లో డివిజన్ కేంద్రంగా ఏర్పాటైన బోధన్ డివిజన్ కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లోనే పరిపాలన సాగిస్తున్నారు. డివిజన్ పరిధిలో బోధన్ పట్టణం, బోధన్, ఎడపల్లి, రెంజల్, కోటగిరి, వర్ని, రూద్రూర్, చందూర్, మోస్రాతో పాటు పోతంగల్, సాలూర మండలాలున్నాయి. ఈ మండలాల్లో గ్రామాల ప్రజలు వివిధ ప్రభుత్వ పనుల నిమిత్తం డివిజన్ కేంద్రానికి రావాల్సిన అవసరం ఉంటుంది. పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలు ఒకచోట లేకపోవడంతో పాటు పనుల కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. డివిజన్ కేంద్రంలో వివిధ పనుల కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజ ప్రజలకు పరిపాలన అందించడానికి ఒక చోట ఉండాల్సిన ప్రభుత్వ కార్యాయలాలకు సొంత భవనాలు లేకపోవడంతో పాటు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు లేక పోవడంతో కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతీ నెల రూ. 4వేల నుంచి రూ. 5వేల అద్దె చెల్లిస్తూ అరకొర వసతులతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.

అద్దె భవనాల్లో ఉన్నవివే..

పట్టణంలోని అద్దె భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయాల్లో ఎక్సైజ్, సబ్ రిజిస్ట్రార్ ఆర్టీఏ, తూనికలు కొలతల డివిజనల్ కార్యాలయాలు ఉన్నాయి. పట్టణంలోని రాకాసీపేట్‌లోని ఎక్సైజ్ కార్యాలయం 20ఏళ్లకు పైగా అద్దె భవనంలో కొనసాగుతుంది. లేబర్ కార్యాలయాన్ని ఇటీవల లయన్స్ కంటి ఆస్పత్రి సమీపంలో నిర్మించిన కమ్యునిటీ సెంటర్‌లోకి మార్చారు. తూనికలు కొలతలు, ఆర్టీఏ కార్యాలయాలు కూడా ఏళ్లుగా అద్దె భవనాల్లోనే సాగుతున్నాయి. ఆర్టీఏ కార్యాలయానికి గతంలో బెల్లాల్ గ్రామంలో స్థలం కేటాయించినా ఇప్పటికి దాని ఊసేలేదు. ఆర్టీఏ కార్యాలయం ఇప్పటికి ఎన్ఎస్ఎఫ్ యాజమాన్యం కేటాయించిన భవనంలోనే సాగుతుంది. ఐకేపీ కార్యాలయానికి ప్రత్యేక భవనం ఉండాల్సి ఉండగా ఈ భవనం అంబేడ్కర్ చౌరస్తాలో బల్దియా ఆధ్వర్యంలో నిర్మించిన కాంప్లెక్స్ పై భవనంలో కొనసాగుతుంది. స్త్రీశక్తి భవనం ఏర్పాటు చేస్తామని ప్రజా ప్రతినిధులు ఇచ్చిన హామీ ఇప్పటికీ ఎదరు చూపుల్లోనే మిగిలి పోయింది. డివిజన్ కేంద్రంలో ఈ కార్యాలయాలకు సొంత భవనాలు లేక పోవడంతో పాటు ఇళ్ళ మధ్య ఉండడంతో ప్రజలకు కార్యాలయాల అడ్రస్‌లు తెలియక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం కార్యాలయాలు ఒకచోట లేక పోవడంతో అధికారులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఉన్నత అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలను ఒక చోట చేర్చి అవస్థలు దూరం చేయాలని డివిజన్ ప్రజలు కోరుతున్నారు.

అన్నదాతలకు నష్ట పరిహారం చెల్లించాలి



రైతులతో మాట్లాడుతున్న తెలంగాణ రైతు సంఘం నాయకులు

నవీపేట: శనివారం వేకువ జామున కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకొని, నష్ట పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని కమలాపూర్‌లో నష్టపోయిన పంటలను వారు శనివారం పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. కోతకు వచ్చిన దశలో అకాల వర్షానికి వరి పంటతో పాటు ఇతర పంటలకు నష్టం జరిగిందన్నారు. వరి పంటకు ఎకరానికి రూ. 20 వేలు, వాణిజ్య పంటలకు ఎకరానికి రూ. 40వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్ సింగ్, మండల నాయకులు రాంసింగ్, కిషన్ పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న గంగపుత్ర సంఘం అధ్యక్షులు పల్లికొండ అన్నయ్య

నిజామాబాద్‌నాగారం: గంగపుత్రులపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నగర గంగపుత్ర సంఘం అధ్యక్షుడు పల్లికొండ అన్నయ్య పేర్కొన్నారు. నగరంలోని గాజుల్‌పేట్ గంగపుత్ర సంఘంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలంలోని ఇసాయిపేట చెరువులో చేపలు పట్టడానికి వెళ్లిన ఇసాయిపేట గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘ సభ్యులపై పక్క గ్రామానికి చెందిన దేవునిపల్లి ముదిరాజ్ కులస్తులు దాడి చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. దాడి చేసిన వారిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేయాలన్నారు. నగర గంగపుత్ర సంఘం నాయకులు పాముల లక్ష్మణ్, రాజు, గంగాధర్, సురేష్, గంగాప్రసాద్, మారుతి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోండి



మోర్తాడ్‌లో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మోర్తాడ్: రాజ్యాంగబద్ధమైన పదవిలో కొనసాగుతూ బీజేపీ కార్యకర్తలు, నాయకులపై భౌతిక దాడులకు పాల్పడతామని బెదిరిస్తున్న మోర్తాడ్ ఎంపీపీ శివలింగు శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మోర్తాడ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల నరేష్ మాట్లాడారు. ఎంపీపీ శ్రీనివాస్‌పై ఆర్మూర్ ఏసీపీకి ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఎంపీపీ కార్యాలయాన్ని బీఆర్ఎస్ కార్యాలయంగా మార్చారని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌పై అసభ్యకరమైన పదజాలంతో దూషించిన ఎంపీపీపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. బీఆర్ఎస్ నాయకులపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సుంకెట్ ఎంపీటీసీ ప్రసాద్, నాయకులు జైడి గంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గంగారెడ్డి, చిన్నయ్య, ప్రకాష్, భోగ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ





భీమ్‌గల్ మండలంలో చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు.. వేల్పూర్ మండలంలో..

భీమ్‌గల్: మండలంలోని పిప్రి, దేవన్‌పల్లి, గంగరాయి, రహత్‌నగర్, పల్లకొండ, కారెపల్లి గ్రామాల్లోని బాధిత కుటుంబాలకు శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, ఎంపీపీ ఆర్మూర్ మహేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య పంపిణీ చేశారు. సొసైటి చైర్మన్ శివసారి నర్సయ్య, రైతుబంధు మండల అధ్యక్షుడు శర్మనాయక్, జెడ్పీ కో ఆప్షన్ మోయిజ్ పాల్గొన్నారు.

వేల్పూర్: మండలంలోని వివిధ గ్రామాల్లోగల బాధిత కుటుంబాలకు మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కులను మండల బీఆర్ఎస్ నాయకులు శనివారం వేల్పూర్‌లో అందజేశారు. ఎంపీపీ బీమజమున, నాయకులు రేగుల్ల రాములు, సామ మహిపాల్, ఎద్ల రాజేశ్వర్‌రెడ్డి, మిట్టపల్లి మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలం



పీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఖలీల్‌వాడి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు ఆరోపించారు. ఈక్రమంలో శనివారం రాష్ట్రంలో ప్రధాని మోదీ పర్యటనను నిరసిస్తూ జిల్లాకేంద్రంలో మోదీ దిష్టిబొమ్మను వారు దహనం చేశారు. ఈసందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన సందర్భంగా ఖమ్మం జిల్లా బయ్యారం ప్రాంతంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, వరంగల్ జిల్లా ఖాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ, ఆర్టికల్చర్ యూనివర్సిటీని, నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి ఉద్యోగాల కల్పనలో విఫలమయ్యారన్నారు. ప్రజలపై భారాలు మోపటంతో పాటు వైశామ్యాలను పెంచి మతోన్మాద విధానాలతో రాజకీయ లబ్ధి కోసం నరేంద్ర మోదీ ప్రయత్నం చేస్తున్నారన్నారు. మోదీకి తెలంగాణ ప్రజల సమస్యలు పట్టవని కేవలం రాజకీయ ప్రయోజనాలు తప్ప మరొకటి లేదని అందువల్లనే ఆయన పర్యటనను నిరసిస్తున్నామన్నారు.

ట్రాఫిక్ సమస్య తీరేదెలా?



బస్టాండ్ ప్రాంతంలో అడ్డదిడ్డంగా నిలిచిన ఆటోలు

- భీమ్‌గల్‌లో ఇష్టారీతిన వాహనాల పార్కింగ్
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



రోడ్డుపై నిలిపిన ఆటో

భీమ్‌గల్: పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రం అవుతోంది. ప్రధానంగా పట్టణంలోని బస్టాండ్ ప్రాతం, ముచ్కూర్ చౌరస్తా, వేల్పూర్ రోడ్డు ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో సరైన పార్కింగ్ ప్రదేశాలు లేకపోవడంతో వాహనదారులు ఎక్కడబడితే అక్కడే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని బస్టాండ్ ప్రాంతంలో ఎంపీడీఓ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాయ, విద్యాశాఖ కార్యాలయం వంటి పలు కార్యాలయాలు ఉండటంతో నిత్యం పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. పట్టణంలోని వ్యాపార సముదాయాల వద్ద సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో సమీపంలోని రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. రోడ్లపై వాహనాలు నిలుపడంతో పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు.

ఇరుకు రోడ్లతో ఇక్కట్లు..



పట్టణంలోని ఇరుకైన రోడ్లపై పెద్ద సంఖ్యలో వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటాయి. దీనికి తోడు ఆటోలు వేగంగా అడ్డదిడ్డంగా వెళుతూ, ఎవరైన నిలబడి కనిపిస్తే చాలు ఎక్కించుకోవాలనే ఉద్దేశంతో హఠాత్తుగా బ్రేకులు వేస్తుంటారు. దీనివల్ల వెనుక వస్తున్న వాహనాలు ఢీకొని ప్రమాదాలు చోటు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి గాయాలపాలవుతున్నారు. సాధారణంగా ఆటోలు ఎక్కడ పడితే అక్కడ రోడ్లపై నిలుపొద్దు. నిర్దేశిత స్టాండ్ వద్దనే నిలుపుకోవాలి. కానీ ఇందుకు విరుద్ధంగా భీమ్‌గల్‌లో ఆటోవాలాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రదానంగా ఆటోలను రోడ్డుపై అడ్డంగా పెడుతుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి, ప్రత్యేక దృష్టిసారించి ఆటోలను నిర్దేశించిన ప్రాంతంలో నిలిపేలా చూడాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

అలరించిన సైన్స్‌ఫేర్



మాక్లూర్: నందిపేట మండల కేంద్రంలోని నియో లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో శనివారం సైన్స్‌ఫేర్ నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్థులు సహజ ఎరువులు వాడకంతో గల లాభాలు, సేంద్రియ వ్యవసాయం, ఆధునిక పద్ధతులు, భూమి కాలుష్యం నివారణ మార్గాలు అనే అంశాలపై ప్రయోగాలను ప్రదర్శించారు. హెచ్ఎం అరుణ్, అఖిల ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మున్సిపల్ కమిషనర్ సీసీ మృతి



హైమద్ (ఫైల్)

నిజామాబాద్‌నాగారం : నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సీసీగా విధులు నిర్వహిస్తున్న గూలం హఫీస్ హైమద్ గుండెపోటుతో చికిత్స పొందుతూ మృతి చెందారు. హైమద్ నగరంలోని హైమాదపూరకాలనీలో నివాసం ఉంటున్నారు. శనివారం మధ్యాహ్నం గుండెపోటు రావడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఆరోగ్యం మరింత క్షీణించడంతో నగరంలోని మనోరమ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు శ్రమించినప్పటికీ ఆరోగ్యం సహకరించకపోవడంతో చికిత్స పొందుతూ రాత్రి 7 గంటల ప్రాంతంలో మరణించారు. మున్సిపల్‌లో విభాగంలో ఎన్ఎంఆర్(నాన్ మస్టర్ రోల్) కింద సతీష్‌పవర్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఉద్యోగంలో చేరారు. అప్పటి నుంచి సుమారు 30 ఏళ్లుగా సీసీగా విధులు నిర్వహిస్తున్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌పై పట్టు ఉండడంతో ఫైల్స్ పెండింగ్ లేకుండా నిబద్ధతగా పనిచేశారు. అందరు కమిషనర్లచే మన్ననలు పొందారు. ఇటీవలే గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రం అందుకున్నారు. పదవీ విరమణ చేసిన తర్వాత కూడా ఔట్ సోర్సింగ్ విధానంలో సీసీగా విధులు నిర్వహిస్తున్నారు. అతనికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

సంక్షిప్తం

బాధిత కుటుంబానికి పరామర్శ



మాక్లూర్: డీకంపల్లి గ్రామ ఎంపీటీసీ కాలగడ్డ గంగమణి దేవన్న కుమారుడు రజినికాంత్ (30) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని శనివారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్యం, మండల నాయకులు పరామర్శించారు.

త్వరలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

రుద్రూర్: మండలంలోని సింగిల్ విండోల ఆధ్వర్యంలో త్వరలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని జెడ్పీటీసీ నరోజి గంగారాం, రైతు సమితి మండల కన్వీనర్ తోట సంగయ్య తెలిపారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులు అధైర్యపడోద్దన్నారు. దళారులకు తక్కువ ధరకు అమ్మి నష్టపొవద్దని, మద్దతు ధరకు కొనుగోలు చేస్తారని పేర్కొన్నారు.

కొనసాగుతున్న పది పరీక్షలు

వర్ని: మండలంలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శనివారం నిర్వహించిన గణితం పరీక్షకు మండలంలో నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ శాంతకుమారి వెల్లడించారు. వర్ని పరీక్షా కేంద్రంలో ముగ్గురు, జాకోరా కేంద్రంలో ఒకరు పరీక్షలకు హాజరుకాలేదని ఆమె వెల్లడించారు. అలాగే చందూరులో ఒకరు మోస్రాలో ముగ్గురు, రుద్రూర్ పరీక్ష కేంద్రంలో ఇద్దరు గైర్హాజరైనట్లు ఎంఈవో వెల్లడించారు.

నేడు రుద్రూర్‌లో 'మట్టిస్నానం'

రుద్రూర్: మండల కేంద్రంలోని చెరువు కట్ట సమీపంలోగల ప్రకృతి వనం వద్ద ఆదివారం పతంజలి యోగా కేంద్రం ఆధ్వర్యంలో మట్టి స్నానం (మడ్‌బాత్) ఏర్పాటు చేసినట్లు నిర్వహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు ఆర్గనైజర్లను సంప్రదించాలని వారు కోరారు.

గోమాతకు అంత్యక్రియలు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మృతి చెందిన గోమాతకు శనివారం హిందూ వాహిని ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. హిందు వాహిని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

